సాక్షి
మంచిర్యాల
శనివారం । 4 । నవంబర్ । 2023



పల్లె దవాఖాన సందర్శన

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్, పొన్నారం గ్రామంలోని పల్లె దవాఖానలను జాతీయ మిషన్ వైద్యారోగ్య శాఖ నోడల్ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం సందర్శించారు. డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల ఉన్నారు.

ముగిసిన విద్యార్థుల సామర్థ్యాల సర్వే

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు, బోధనా పద్ధతులు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అమలు చేస్తున్న వ్యూహాలపై సర్వే చేపట్టారు. ఎంపిక చేసిన 392 పాఠశాలల్లోని 586 సెక్షన్లలో సర్వే చేశారు. ఇందులో 13,428 మంది విద్యార్థులకు గాను 13,126 మంది పాల్గొన్నారు. ఓఎంఆర్ ఆధారంగా పరీక్ష చేపట్టారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల వ్యయ పరిశీలకులు రాక




అజయ్‌గౌతమ్, అశోక్‌కుమార్‌లకు స్వాగతం

నస్పూర్: జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియామకమైన అశోక్‌కుమార్ సుతార్, అజయ్‌గౌతమ్ శుక్రవారం జిల్లాకు వచ్చారు. స్థానిక సీసీసీ నస్పూర్ సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ వారికి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు అశోక్‌కుమార్ సుతార్, మంచిర్యాల నియోజకవర్గానికి అజయ్ గౌతమ్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారు. జిల్లాలో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార ఖర్చులు పర్యవేక్షిస్తారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రామ్‌నాథ్

మందమర్రిరూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. శుక్రవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై హరిశేఖర్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడం చొప్పరిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి వాహనాల తనిఖీ నిర్వహించారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, కాసిపేట ఏఎస్సై గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నయ్య ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సుభాష్‌నగర్ బస్తీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 5, 6, 7, 8, 19వ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి మరోసారి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. 19వ వార్డులో ఎమ్మెల్యే చిన్నయ్య సతీమణి జయతార ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

పలు బస్తీల్లో ప్రజలు ఎమ్మెల్యే చిన్నయ్యను నిలదీశారు. సుభాష్‌నగర్, శాంతిఖని, నెంబర్-2 ఇంక్‌లైన్ బస్తీల ప్రజలు ఇళ్లపట్టాలు ఇవ్వలేదని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యాక పట్టాలిస్తారని చిన్నయ్య తెలిపారు.

నేడు వివేక్ రాక

మందమర్రిరూరల్: పెద్దపల్లి మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం వివేక్ శనివారం మందమర్రికి వస్తున్నారని సమాచారం. హైదరాబాద్‌లో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మరికొందరితో సమావేశమైనట్లు తెలిసింది. శనివారం మందమర్రిలోని ఓదెలు ఇంట్లో ప్రచార ప్రణాళిక రూపొందించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కాగా, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గుడ్ల రమేష్, అర్జున్ మహంత్ పార్టీకి రాజీనామా ప్రకటించారు. వీరితోపాటు బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

ధరణి పోతే దళారుల రాజ్యమే..



సభా వేదికపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనచారి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్

- ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి
- ముథోల్‌కు నేను అండగా ఉంటా
- పుణ్యభూమికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా
- అమ్మ ఆలయానికి నిధులు మంజూరు చేస్తా
- గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు సీసీ లైనింగ్ పనులు పూర్తి చేస్తా
- బీడీ కార్మికుల కటాఫ్ పైన నిర్ణయం తీసుకుంటా
- త్వరలోనే 50వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నుంచి సాగునీరు
- భైంసా సభలో సీఎం కేసీఆర్



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ముథోల్ నియోజకవర్గ ప్రజలు



విక్టరీ సంకేతం చూపుతున్న కేసీఆర్, విఠల్‌రెడ్డి

భైంసా: 'కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ నాయకులు ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తామంటున్నారు. ధరణి పోర్టల్ వల్ల దళారులు, లంచావతారాల బెడద తప్పింది. అధికారుల చుట్టూ నెలల తరబడి తిరిగే అవసరం లేకుండా పోయింది. కాంగ్రెస్ గెలిస్తే ధరణి పోతే మళ్లీ దళారులదే రాజ్యం.. ముథోల్ నియోజకవర్గ ప్రజలకు నేను అన్నివిధాలుగా అండగా ఉంటా.. ఆలోచించి ఓటేయండి' అని అన్నారు సీఎం కేసీఆర్. భైంసా పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు ఆయన హాజరయ్యారు. హెలిక్యాప్టర్‌లో భైంసాకు చేరుకున్న సీఎం కేసీఆర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో సభాస్థలికి కేసీఆర్ చేరుకున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సీఎంకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'చదువులతల్లి బాసర సరస్వతి కొలువైన పుణ్యభూమికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. గతంలో ఇక్కడ గోదావరి పుష్కరాలు జరగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బ్రహ్మాండంగా బాసరలో గోదావరి పుష్కరాలు జరుపుకుంటున్నాం. బాసర సరస్వతీ దేవాలయానికి గతంలో రూ.50 కోట్లు కేటాయించాం. ఇక ముందు ఎన్ని కోట్లు అవసరమైతే అంత మంజూరు చేస్తా. గడ్డెన్నవాగు ప్రాజెక్టు చానల్ పనులు పూర్తి చేసి మరో రెండువేల ఎకరాలకు సాగునీరు అందేలా చూస్తాం. గతంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద 4 వేల ఎకరాలకే సాగునీరు అందేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీసీ కెనాల్ నిర్మించి 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. మిగిలిన పనులు పూర్తి చేసి మరో 2 వేల ఎకరాలకు నీరందేలా చూస్తాం. ఈ ప్రాజెక్టు కింద 14 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. బీడీ కార్మికుల కటాఫ్ తేదీపై నిర్ణయం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ఎంతోమంది బీడీ కార్మికులు ఉన్నారు. వారందరికీ అందరికీ ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

మరిన్ని నిధులివ్వండి..

ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇప్పటివరకు ఇచ్చిన నిధులతో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. గుండెగాం గ్రామ పునరావాస ప్యాకేజీకి నిధులు ఇచ్చారని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 140 ఏళ్ల క్రితం నిర్మించిన సిరాల ప్రాజెక్టు కొట్టుకుపోయిందని ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.11 కోట్లతో నిర్మాణ పనులకు ప్రతిపాదనలు రూపొందించారని తెలిపారు. ఈ ప్రాజెక్టుతోపాటు మరో 8 చెరువులు తెగిపోయాయని వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. బాసర ఆలయానికి మరో రూ.100 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేయాలన్నారు. ముథోల్ నియోజకవర్గవాసులకు గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారని, అయితే ఈనీరు సరిపోక కొన్నిసార్లు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఎస్సారెస్పీ నుంచి గడ్డెన్నవాగు ప్రాజెక్టును పంపితే ఈ సమస్య తీరుతుందన్నారు. నియోజకవర్గంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్నందున మరిన్ని కళాశాలలు మంజూరు చేయాలని కోరారు. కుభీర్ మండలంలో పెద్ద గ్రామమైన పల్సిని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు.

50 వేల ఎకరాలకు సాగునీరు..

త్వరలోనే ముథోల్ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నుంచి లిఫ్ట్ ద్వారా సాగునీరు అందిస్తామని కేసీఆర్ ప్రకటించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. భైంసా వాసులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో పింఛన్ తప్ప మరే పథకాలు ఇవ్వడం లేదన్నారు. మహారాష్ట్ర నుంచి దేశ వ్యాప్తంగా లారీలు నడిపే డ్రైవర్లు తెలంగాణ ఎంత దూరమని అడిగితే నునుపు రోడ్లు వచ్చాయంటే తెలంగాణ వచ్చిందని చెబుతారని, ఇలా పక్క రాష్ట్రం మెచ్చుకునేలా పూర్తిస్థాయి రోడ్లు నిర్మించుకున్నామని వివరించారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు మరింత చేయూతనందించే బీఆర్‌ఎస్‌నే మరోమారు గెలిపించాలని కోరారు.

తరలివచ్చిన జనం...

నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలోనే బహిరంగ సభకు తరలివచ్చారు. పార్డి(బి) బైపాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన సభాప్రాంగణం గులాబీమయమైంది. ఏడు మండలాలనుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చారు. భైంసా సభలో బీఆర్‌ఎస్ ముథోల్, నిర్మల్ అభ్యర్థులు గడ్డిగారి విఠల్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ దామోదర్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనచారి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, మాజీ ఎంపీ నగేశ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఉద్యమనేత విలాస్‌గాదేవార్, బీఆర్‌ఎస్ నాయకులు పడకంటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న అభ్యర్థి గొర్లపల్లి సురేష్



చెన్నూర్‌లో నామినేషన్ వేస్తున్న సంజీవ్



నామినేషన్ పత్రం అందజేస్తున్న శ్రీదేవి

నామినేషన్లు షురూ

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం శుక్రవారం మొదలైంది. మంచిర్యాల నియోజకవర్గానికి గాను స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా గొర్లపల్లి సురేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఒకటే నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రాములు తెలిపారు. నామినేషన్ దాఖలుకు ఈ నెల 10 వరకు గడువు ఉండగా ముహూర్త బలం చూసుకుని నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు వేచి చూస్తున్నారు. ఈ నెల 7, 9న మంచిరోజులు ఉండడంతో ఆ రోజే ఎక్కువ మంది నామినేషన్ వేసే అవకాశం ఉంది. పోటీ చేసే 11 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు, ఎస్సైలు జగదీష్, మహేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెన్నూర్‌లో

చెన్నూర్: చెన్నూర్‌లో సోగాల సంజీవ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తుకు అందజేశారు. కాగా, సంజీవ్ 2018లో జరిగిన ఎన్నికల్లో ఆర్‌పీఐకే పార్టీ నుంచి కెమెరా గుర్తుపై పోటీ చేసి 6,274 ఓట్లతో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ తర్వాత మూడో స్థానంలో నిలిచారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీకి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాహుల్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, అధికార ప్రతినిధి చిలుముల కృష్ణదేవరాయలు, నియోజకవర్గ కో కన్వీనర్ రాజులాల్, సీనియర్ నాయకుడు రేవెల్లి రాజలింగు పాల్గొన్నారు. ఆర్‌వో కార్యాలయం వద్ద సాయుధ పోలీసు బలగాలు బందోబస్తు చేపట్టాయి.

తెలుగు పత్రాల్లో తప్పులు..?

కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయడానికి గాను తెలుగులో ముద్రించిన నామినేషన్ పత్రాలను అధికారుల నుంచి పొందారు. వాటిలో తప్పులు ఉన్నట్లు గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సవరించి ఇస్తామని చెప్పడంతో నామినేషన్ వేయకుండానే వెనుదిరిగినట్లు అంబాల మహేందర్ తెలిపాడు.

అసంతృప్తి సెగలు !

- ద్వితీయ శ్రేణి నాయకులతో బేజారు
- ఏ పార్టీతో టచ్‌లో ఉంటున్నారోనని టెన్షన్
- హామీలు, బుజ్జగింపులతో కొంతమేర నిలుపుదల
- కేడర్‌ను కాపాడుకోవడమే అభ్యర్థులకు సవాల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల్లోని నాయకుల అసంతృప్తి సెగలు అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధాన పార్టీల్లో అసమ్మతి కార్యకర్తలు, నాయకులు పార్టీని వీడుతుండడంతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతీ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకెళ్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కన్నా పార్టీ కేడర్‌ను కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉండడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల్లో గ్రామ, మండల, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు వలసలతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెద్ద నాయకుల హామీలు, బుజ్జగింపులతో కొంతమేర చల్లబడుతున్నా ఎన్నికల్లో తమకు పూర్తి స్థాయిలో పని చేస్తారా..? లేదా..? అనే సందేహాలు వెంటాడుతున్నాయి.

'గులాబీ' గూటిలో లుకలుకలు

ఎన్నికల సమయంలో అధికార 'గులాబీ' పార్టీలో అసంతృప్తి పవనాలు వీస్తూనే ఉన్నాయి. అధికారంలో ఉండగా తమకు పదవులు దక్కకపోవడం, సంక్షేమ పథకాలు అందకపోవడం, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదనే కారణాలతో ఇప్పటికే పలువురు నాయకులు పార్టీ మారారు. ఇదే అదునుగా ప్రతిపక్షాలు ఇలాంటి నాయకులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో బీఆర్‌ఎస్ పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఎక్కడికక్కడ కేడర్‌ను కాపాడుకోవడమే ఎమ్మెల్యేలకు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) పరిధిలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అసమ్మతి బాట పడుతున్నారు. దీంతో వారంతా ఏ పార్టీ వైపు వెళ్లి తమకు ఎన్నికల్లో నష్టం చేస్తారోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు కండువాలు మార్చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో కాసిపేట మండల నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ వరకు ఫోన్ మాట్లాడిస్తేనే చల్లబడ్డారు. ఇక బెల్లపల్లి పట్టణం, మందమర్రి, చెన్నూరులో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి కారణంగా నాయకుల మధ్య అసమ్మతి మరింత పెరిగే అవకాశం ఉంది.

'కమలం' పార్టీలోనూ..

కమలం పార్టీలో గత కొంతకాలంగా కీలకంగా వ్యవహరించిన మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్‌లో చేరడంతో కేడర్ నిరాశకు లోనయ్యారు. జిల్లా రాజకీయాలతోపాటు చెన్నూరు నియోజకవర్గంలో ఆయన పార్టీ గెలుపు కోసం కీలకంగా పని చేస్తారనే తరుణంలో పార్టీ మారడంతో ద్వితీయ శ్రేణి నాయకులు ఆలోచనలో పడ్డారు. మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థిగా ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు పార్టీ బలోపేతం కోసం చెమటోడ్చుతున్నారు. పార్టీలో చేరికలపై దృష్టి సారించారు. ఇక బెల్లంపల్లి టికెట్ మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవికి ఇవ్వడంతో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొయ్యల ఏమాజీ నిరసనలు కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఇంకా పార్టీ కుదురుకోలేదు. ఖానాపూర్ పరిధిలో ఉన్న జన్నారం మండలంలో పార్టీ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కాంగ్రెస్‌లో చేరికలు

అధికార పార్టీ నుంచి అధికంగా నాయకుల చేరికలు కాంగ్రెస్‌లో పార్టీలోకే వెళ్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో చేరికలు సాగుతున్నాయి. జిల్లాలో రోజుకో చోట ద్వితీయ శ్రేణి నాయకుల చేరికలతో ఆ పార్టీ నాయకుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. చెన్నూరులో వివేక్ పోటీ చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇక్కడ గత కొంతకాలంగా టికెట్ ఆశించిన నాయకులు అసంతృప్తికి లోనయ్యారు. వీరంతా మొదట పార్టీ మారేందుకు సన్నద్ధం అయినప్పటికీ తిరిగి ఇదే పార్టీలో కొనసాగేందుకు అంగీకరిస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్తులను బుజ్జగిస్తే దారికి వచ్చే అవకాశాలు చూస్తున్నారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పార్టీలో వర్గాలుగా ఉన్న చోట్ల నాయకుల మధ్య సమన్వయానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయించే ఆయుధం

- రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్
- జన్నారానికి చేరిన బస్సుయాత్ర



మాట్లాడుతున్న చంద్రకుమార్

జన్నారం: ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయించే ఆయుధమని, మంచి పాలన అందించే వారికి వేయాలని హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి చంద్రకుమార్, రిటైర్డు కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక(టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం జన్నారానికి చేరింది. స్థానిక నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కడెం ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓటర్లు మద్యం, కులం, డబ్బులకు లొంగిపోకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడలకు చరమగీతం పాడాలని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో అవేవీ లేకుండా పాలకులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. కడెం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని తెలిసినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజావేదిక కన్వీనర్ వినాయకరెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, సమన్వయకర్త కృష్ణప్రసాద్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు నందిరామయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, జలసాధన సమితి నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఏనుగు సుభాష్‌రెడ్డి, మచ్చ శంకరయ్య, సీపీఎం నాయకులు అశోక్ పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- భీమారంలో ఎన్నికల ప్రచారం



భీమారంలో బాల్క సుమన్ ప్రచారం

భీమారం: ఈ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని, మరో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ తాను మొదటిసారి ఎన్నికైన వెంటనే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వందలాది కోట్లు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని తెలిపారు. సిద్దిపేట, సిరిసిల్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, సర్పంచ్ గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట మాజీ సర్పంచ్ కుంభం మల్లారెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. శుక్రవారం బాల్క సుమన్ పరామర్శించారు. ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

బీఆర్‌ఎస్ వినూత్న ప్రచారం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం జిల్లా కేంద్రంలో వినూత్నంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. బ్యాండ్ డప్పులతో పలువురు కార్యకర్తలు ఇచ్చే నినాదాలతో 31వ వార్డులో ప్రచారాన్ని హోరెత్తించారు. బ్యాండ్ డప్పులకు అనుగుణంగా 'అపోజిషన్‌కు ఓటేస్తే కష్టాలు తప్పా ఇంకా ఏమీరావు, అందుకే మంచిర్యాలలో మళ్ల గెలవాలే మన అన్న దివాకర్‌రావు' అంటూ, '30వ తారీఖు మన అందరి వేళ్లకి ఇంకు, 3వ తారీఖు నాడు మంచిర్యాల అంతా పింకు' అంటూ కార్యకర్తలు హుషారును నింపగా, నడిపెల్లి దివాకర్‌రావు 'అప్పుడెట్ల ఉండే తెలంగాణ, ఇప్పుడెట్ల ఉంది తెలంగాణ' అంటూ బ్యాండ్ డప్పుల దరువుకు అనుగుణంగా చెబుతూ ప్రచారం చేశారు. ఈ ప్రచారం స్థానికులను ఆకట్టుకుంది.



బ్యాండ్ చప్పుళ్ల మధ్య నినాదాలు

బెల్లంపల్లి ఆర్డీవో ఆకస్మిక బదిలీ



ఆర్డీవో సురేష్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్డీవో కాసబోయిన సురేష్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. శుక్రవారం రాత్రి ఆయనను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. సురేష్‌ను కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ ఆర్డీవోగా బదిలీ చేయగా ఆయన స్థానంలో వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పొరిక హరికృష్ణను నియమించారు. సురేష్ జిల్లాలో రెవెన్యూ అధికారిగా పని చేశారు. కొన్ని నెలలపాటు వేరే జిల్లాకు వెళ్లి విధులు నిర్వహించి ఎన్నికలకు ముందు బెల్లంపల్లి ఆర్డీవోగా బదిలీపై వచ్చారు. అత్యధిక కాలం జిల్లాలో పని చేసిన సురేష్‌ను తిరిగి నియమించడంపై విమర్శలు వచ్చాయి. ఇటీవల కొందరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎన్నికల సంఘం బదిలీ చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


మణిదీప్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని కేసీఆర్ కాలనీకి చెందిన బూడిద రాజయ్య–రాజేశ్వరి దంపతుల కుమారుడు మణిదీప్(29) బైక్పై మంచిర్యాలకు వస్తున్నాడు. ఈక్రమంలో స్థానిక రైల్వేఫ్లెఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం బైక్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మణిదీప్ ఐటీసీ కంపెనీలో ఫీల్డ్వర్క్ చేస్తూ జీవనం సాగించేవాడు. కంపెనీ పని మీదనే మంచిర్యాలకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మణిదీప్కు ఏడాదన్నర క్రితం తిరుమలేశ్వరితో వివాహమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెబ్బెనలో మహిళ..


మహిళ మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కాగజ్నగర్ ఎక్స్రోడ్ వద్ద శుక్రవారం వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతురాలు గత కొంత కాలంగా కాగజ్నగర్ ఎక్స్రోడ్ వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈక్రమంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 8712670532, 8712670510 సెల్ నంబర్లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

వాంకిడి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక చెక్ పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లోరూ.లక్ష 5 వేల నగదు పట్టుబడినట్లు ఎస్సైలు సాగర్, తేజస్విని తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా భుజ్ గ్రామానికి చెందిన ఆకాశ్ మోరేశ్వర్ జోడే వాహనాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఆర్ఐ మాజీద్, తదితరులు ఉన్నారు.

నిర్మల్ క్షేత్రంలో రెడ్డిలదే హవా

- ఇప్పటివరకు ఒకరు మినహా వారిదే హవా
- ప్రధానపార్టీల నుంచి పోటీ
- ప్రస్తుత పోటీదారుల్లో ఇద్దరు రెడ్డిలే
- నిర్మల్ కంచుకోట వారిదేనా
- అమాత్యులు, ఎంపీలుగా అవకాశం

నిర్మల్ నియోజకవర్గంలో ఓటర్లు

పురుషులు: 1,17,563
మహిళలు: 1,26,102
మొత్తం: 2,47,495

మండలాలు..

నిర్మల్ అర్బన్, నిర్మల్రూరల్, దిలావర్పూర్, నర్సాపూర్(జి), సారంగాపూర్, లక్ష్మణచాంద,మామడ,సోన్




వేణుగోపాలాచారి


శ్రీహరిరావు


మహేశ్వర్రెడ్డి


గోపిడి గంగారెడ్డి


కె.ముత్యంరెడ్డి


పి.నర్సారెడ్డి


ఏ.భీంరెడ్డి


నల్ల ఇంద్రకరణ్రెడ్డి


పి.గంగారెడ్డి

సంవత్సరం	గెలుపొందినఅభ్యర్థి	పార్టీ	ఓడిన సమీపఅభ్యర్థి	పార్టీ
2018	ఎ.ఇంద్రకరణ్రెడ్డి	బీఆర్ఎస్	ఎ.మహేశ్వర్రెడ్డి	కాంగ్రెస్
2014	ఎ.ఇంద్రకరణ్రెడ్డి	బీఎస్పీ	కె.శ్రీహరిరావు	బీఆర్ఎస్
2009	ఎ.మహేశ్వర్రెడ్డి	పీఆర్పీ	ఎ.ఇంద్రకరణ్రెడ్డి	టీడీపీ
2004	ఎ.ఇంద్రకరణ్రెడ్డి	కాంగ్రెస్	వి.సత్యనారాయణగౌడ్	టీడీపీ
1999	ఎ.ఇంద్రకరణ్రెడ్డి	కాంగ్రెస్	ఎస్.ఇంద్రకరణ్రెడ్డి	టీడీపీ
1996	ఎస్.ఇంద్రకరణ్రెడ్డి	టీడీపీ	అప్పాల మహేశ్	కాంగ్రెస్
1994	ఎస్.వేణుగోపాలాచారి	టీడీపీ	పి.నర్సారెడ్డి	కాంగ్రెస్
1989	ఎస్.వేణుగోపాలాచారి	టీడీపీ	ఎ.భీంరెడ్డి	కాంగ్రెస్
1985	ఎస్.వేణుగోపాలచారి	టీడీపీ	జీవీ.నర్సారెడ్డి	కాంగ్రెస్
1983	ఎ.భీంరెడ్డి	టీడీపీ	పి.గంగారెడ్డి	కాంగ్రెస్
1978	పి.గంగారెడ్డి	కాంగ్రెస్	పి.నర్సారెడ్డి	కాంగ్రెస్
1972	పి.నర్సారెడ్డి	కాంగ్రెస్	ఏకగ్రీవం	
1967	పి.నర్సారెడ్డి	కాంగ్రెస్	ఎల్.ప్రభాకర్రెడ్డి	స్వతంత్ర
1962	పి.నర్సారెడ్డి	కాంగ్రెస్	పి.గంగారెడ్డి	స్వతంత్ర
1957	కె.ముత్యంరెడ్డి	స్వతంత్ర	ఆర్.దేశ్పాండే	కాంగ్రెస్
1952	జి.గంగారెడ్డి	సోషలిస్ట్	పి.రెడ్డి	కాంగ్రెస్

నిర్మల్ఖిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజకీయ ఖిల్లాగా పేరొందిన నిర్మల్ నియోజకవర్గం ఇప్పటికీ హాట్టాపికే. ప్రధానంగా ఇక్కడి నుంచి గెలిచినవారే జిల్లావ్యాప్తంగా చక్రం తిప్పారు. రాజకీయ ఉద్దండులందరూ ఇక్కడి నుంచి ఎదిగినవారే కావడం విశేషం. నిర్మల్ నియోజకవర్గం తొలినాళ్ల నుంచి రెడ్డిలతే ఆధిపత్యం కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుత జిల్లాలో నిర్మల్, ముధోల్ (జనరల్) ఖానాపూర్ (ఎస్టీ) స్థానాలు ఉన్నాయి. నిర్మల్లో రెడ్డి వర్గం నుంచి రాజకీయ చైతన్యం అధికంగా ఉండటంతోనే ఇది సాధ్యమవుతోందని పరిశీలకులు భావిస్తున్నారు. అన్ని ప్రధానపార్టీల నుంచి వారే బరిలో నిలవడంతో ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతూ వస్తున్నారు. మొట్టమొదట ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నప్పుడు 1952లో ఎమ్మెల్యేగా ఎన్నికైన గోపిడి గంగారెడ్డి మొదలుకొని 2018లో గెలిచిన అల్లోల ఇంద్రకరణ్రెడ్డి వరకు దాదాపు రెడ్డి వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు విజయం సాధిస్తూ వస్తున్నారు.

రెడ్డి సామాజికవర్గ రాజకీయ నేపథ్యం..

1952లో జరిగిన తొలిసారి నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న నిర్మల్ నుంచి జి.గంగారెడ్డి సోషలిస్టు పార్టీ నుంచి గెలుపొందగా, 1957లో కె.ముత్యంరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు. 1962, 1967, 1972ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పి.నర్సారెడ్డి వరుసగా గెలిచారు. 1978 ఎన్నికల్లో పి.గంగారెడ్డి కాంగ్రెస్ నుంచి, 1983లో టీడీపీ తరపున ఏ.భీంరెడ్డి శాసనసభలో అడుగుపెట్టారు. 1985లో టీడీపీ అభ్యర్థిగా సముద్రాల వేణుగోపాలాచారి మొదటిసారిగా రెడ్డియేతర సామాజిక వర్గం నుంచి విజయం సాధించారు. 1989, 1994లో వరుసగా గెలుపొంది మంత్రిగా పనిచేశారు. 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అల్లోల ఇంద్రకరణ్రెడ్డి, 2009లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి పీఆర్పీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన శాసనసభ ఎన్నికల్లో మళ్లీ ఇంద్రకరణ్రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి పదవి చేపట్టారు. వరుసగా 2018లో గెలిచి మరోసారి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, 1996 జరిగిన ఉప ఎన్నికల్లో నల్ల ఇంద్రకరణ్రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అక్కడి నుంచి వరుసగా రెడ్డి వర్గానికి చెందిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి రెండుసార్లు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఒకసారి గెలిచారు. రాష్ట్రం ఏర్పడ్డాక 2014, 2018లో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు.


ఇంద్రకరణ్రెడ్డి

స్వరాష్ట్రంలో రెండుసార్లు మంత్రి పదవి

రాష్ట్ర ఏర్పడ్డాక 2014లో తొలిసారి శాసనసభ ఎన్నికల్లో నిర్మల్ నుంచి బీఎస్పీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అప్పటి టీఆర్ఎస్లో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి ఉమ్మడి జిల్లా నుంచి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, నిర్మల్ నుంచి అల్లోల ఇద్దరు రాష్ట్ర మంత్రులుగా పని చేయడం గమనార్హం. 2018లో టీఆర్ఎస్ నుంచి గెలుపొందిన అల్లోల మరోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈయన నిర్మల్ నుంచి గెలుపొంది..రెండుసార్లు రాష్ట్రమంత్రి పదవి చేపట్టడం విశేషం.

'రెడ్డి'లపై 'చారి'త్రాత్మక విజయం..

నిర్మల్ నుంచి బరిలో ఉన్న రెడ్డి వర్గానికి చెందిన వారిపై మూడుసార్లు బీసీ సామాజికవర్గానికి చెందిన సముద్రాల వేణుగోపాలాచారి గెలుపొందడం విశేషం. మొదటిసారి 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో జీవీ నర్సారెడ్డిపై దాదాపు 23 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. 1989లో అయిండ్ల భీమ్రెడ్డి, 1994లో పి.నర్సారెడ్డిపై వేణుగోపాలాచారి మూడుసార్లు గెలుపొందారు. అనంతరం రాష్ట్రమంత్రిగా, ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా పనిచేశారు.

ప్రస్తుత పోటీల్లో ఇద్దరు వారే..

ప్రస్తుత ఎన్నికల్లో పార్టీల నుంచి బరిలో ఉన్నవారిలో ఇద్దరు రెడ్డి సామాజికవర్గం వారు. అల్లోల ఇంద్రకరణ్రెడ్డి (బీఆర్ఎస్), మహేశ్వర్రెడ్డి(బీజేపీ) ఉన్నారు. కాంగ్రెస్ నుంచి వెలమ సామాజికవర్గానికి చెందిన కూచాడి శ్రీహరిరావు పోటీలో ఉన్నారు.

అడవిపందుల దాడిలో పంటల నష్టం


ఖర్జెల్లి శివారులో ధ్వంసమైన వరి

చింతలమానెపల్లి: మండలంలోని అటవీప్రాంతం శివారులోని పంటలను అడవి పందులు దాడి చేస్తున్నాయి. గంగాపూర్, ఖర్జెల్లి, కోయపెల్లి, గూడెం, చిత్తాం, దిందా, కేతిని, శివపెల్లి గ్రామాల పరిధిలోని పత్తి, వరి పంటలను నాశనం చేస్తున్నాయి. పత్తి మొక్కల మధ్యన అడవి పందులు ఆవాసాలు ఏర్పరుచుకుని పంటలను తినేస్తున్నాయి. తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై శుక్రవారం ఖర్జెల్లి రేంజ్ అటవీ అధికారి చంద్రమౌళి సంప్రదించగా, పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రైతులు తమ పంట నష్టం వివరాలను అటవీశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

పెంచికల్పేట్: మండలంలోని కొండపల్లికి చెందిన మేకల వెంకటి శుక్రవారం అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామసమీపంలో వరి పంట పరిశీలించడానికి ఉదయం వెళ్లాడు. అక్కడ అడవి పంది ఆకస్మాత్తుగా దాడికి దిగింది. పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు పరుగెత్తి రావడంతో అడవి పంది అక్కడి నుంచి వెళ్లింది. గాయపడిన వెంకటిని అంబులెన్సులో కాగజ్నగర్ ఆస్పత్రికి తరలించారు. బాధిత రైతుకు అటవీశాఖ నుంచి పరిహారం అందిస్తామని డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ తెలిపారు.

నిర్లక్ష్యం వల్లే కార్మికుడి మృతి

- ఏటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


కుటుంబీకులను పరామర్శిస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: కంపెనీ నిర్లక్ష్యం వల్లే ఆర్కే7 గనిలో ఫిట్టర్ కార్మికుడు వెంకటేశ్ మృతి చెందాడని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. శుక్రవారం రామకృష్ణాపూర్లోని ఏరియా ఆసుపత్రి వద్ద వెంకటేశ్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో వెంటిలేషన్ సరిగా లేక అస్వస్థతకు గురై వెంకటేశ్ కిందపడి ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. రామకృష్ణపూర్ ఏరియా ఆస్పత్రిలో అతనికి సరైన వైద్యం అందలేదన్నారు. కంపెనీ అధికారుల నిర్లక్ష్యవైఖరి వల్ల కార్మికుడు మృత్యువాత పడ్డారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించిన సింగరేణి కంపెనీ కార్మికుల ప్రాణాలు రక్షించడానికి ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో కనీస వైద్యసౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గని ప్రమాదంగా గుర్తించి టెర్మినల్ బెనిఫిట్స్ను కుటుంబానికి అందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ఎస్కేబాజీసైదా, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేశ్, ఏరియా కార్యదర్శి మారుపల్లి సారయ్య, నాయకులు బీర రవీందర్, మురళీచౌదరి, అఫ్రోజ్ ఖాన్, రేగుల శంకర్ పాల్గొన్నారు.

'యాజమాన్యమే బాధ్యత వహించాలి'

సరైన వైద్యం అందకపోవడం వల్లే వెంకటేశ్ మృతి చెందాడని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, అధ్యక్షుడు బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందితే కార్మికుడు బతికేవాడని తెలిపారు. దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఐలాండ్ ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తా నిర్మాణం చేపట్టిన ఐలాండ్ను గురువారం రాత్రి బైక్తో ఢీకొన్న వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. మందమర్రికి చెందిన ఆరెపెల్లి రాజేంద్రప్రసాద్–వనజ దంపతుల కమారుడు శివ వెంకటసాయి(25) సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మంచిర్యాలకు తన బైక్పై వచ్చి తిరిగివెళ్తుండగా ఐలాండ్ను ఢీకొని తలకు తీవ్రగాయమైంది. పోలీసులు అతన్ని అంబులెన్స్లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా, హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు పోయేవి కాదని వారు కుటుంబ సభ్యులు రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది.

గుడుంబా తయారీపై ఉక్కుపాదం


బెల్లంపల్లి: బెల్లంపానకాన్ని పారబోస్తున్న అధికారులు

బెల్లంపల్లి: గ్రామాల్లో గుడుంబా తయారీ, అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అధికారులు దాడులు ముమ్మరం చేశా రు. గతనెల 9 నుంచి శుక్రవారం వరకు 207 కేసులు నమోదు చేసి గుడుంబా తయారీ చేసి అమ్మకా లు సాగిస్తున్న 160 మందిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ డి.దీపక్ తెలిపారు. తనిఖీలు నిర్వహించి 310.21 లీటర్ల నాటుసారా, 1170 కిలోల బెల్లం, 62 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి వినియోగించే 25, 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బెల్ట్ షాపుల్లో 316.14 లీటర్ల మద్యం, 407.79 లీటర్ల బీరును ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న 60 లీటర్ల తెల్లకల్లును పారబోసి, అక్రమ రవాణాకు వినియోగించిన 6 బైక్లను జప్తు చేశారు. నాటుసారా తయారీ చేస్తున్న 29 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆబ్కారీ సీఐ వెల్లడించారు.

చింతలమానెపల్లి: మండలంలోని లంబడిహేటి గ్రామంలోని శుక్రవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. నాటుసారా తయారీ చేస్తున్న జరుపుల మంగా భాయ్, అజ్మీర గోపిపై కేసు నమోదు చేశామన్నారు. 3 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. 160 కిలోల పటిక, 250 కిలోల నల్లబెల్లం, 15 లీటర్ల నాటు సారా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఎక్సైజ్ ఎస్సై స్వాతి, కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కేసులు నమోదు

లక్సెట్టిపేట: పట్టణ ఆబ్కారీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పలు కేసులు నమోదు చేసినట్లు సీఐ బాబా శుక్రవారం తెలిపారు. తనిఖీల్లో 304 లీటర్ల నాటుసారా, 234 కిలోల బెల్లం, 221 కిలోల పటిక, 16,400 లీటర్ల బెల్లం పానకం, బెల్టుషాపుల్లో 99.74 లీటర్ల మద్యం, 251.31 లీటర్ల బీర్లు, అక్రమ రవాణాకు ఉపయోగించే మూడు బైక్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. 26 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

నెన్నెల: కుశ్నపల్లిలో ఇళ్లలో అక్రమంగా నిల్వచేసిన పటిక, బెల్లాన్ని శుక్రవారం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. 12 కాటన్లలో దాచి ఉన్న 240 కిలోల బెల్లం, 8 కిలోల పటికతోపాటు 45 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 250 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశామన్నారు. మేడపు శంకర్, మేడపు మధునక్కలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్లో శుక్రవారం గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అమిత్కుమార్ వద్ద రెండు క్వార్టర్లు, మూడు ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నిర్మల తెలిపారు. అమిత్కుమార్పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తీవ్ర జ్వరంతో ఒకరి మృతి


నరేందర్ (ఫైల్)

జన్నారం: తీవ్రజ్వరంతో ఒకరి మృతి చెందిన ఘటన మండలంలోని చింతగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అనుమాల నరేందర్ (25) రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీవల్లిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఐదు నెలల పాప ఉంది. నరేందర్ హైదరాబాద్లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 20 రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఆసుపత్రుల్లో చూపెట్టుకున్న తగ్గలేదు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. పరిస్థితి విషమించడంతో గురువారం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారం బస్టాండ్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మంచిర్యాల నుంచి చెన్నూరు వైపు వెళ్తున్న కారు అతివేగంగా వెళ్తోంది. చెన్నూరు మండలం చాకెపల్లికి చెందిన దుర్గసాగర్ బైక్పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ వద్ద మూలమలుపు వద్ద బైక్ను కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గసాగర్ను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. కాగా, కారు అతివేగంగా వచ్చి బైక్తోపాటు అక్కడే ఉన్న ఆటోరిక్షాలను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు.

ఏరియా ఆసుపత్రుల సందర్శన


రామకృష్ణాపూర్: సీఎంఓ సుజాతను సన్మానిస్తున్న వైద్యాధికారులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్లోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ)డాక్టర్ సుజాత శుక్రవారం సాయంత్రం సందర్శించారు. పలు వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరాతీశారు. వైద్యం కోసం వచ్చే రోగులకు ఆసుపత్రిలో మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. కాగా, సీఎంఓగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి ఇక్కడికి విచ్చేయడంతో డీవైసీఎంఓ డాక్టర్ ఉషారాణి ఇతర వైద్యులు ఆమెను శాలువాతో సత్కరించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఎత్తివేయమని, అన్ని విధాలుగా అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని సీఎంఓ సుజాత అన్నారు. ఆసుపత్రిని శుక్రవారం తనిఖీ చేసి వార్డులను పర్యవేక్షించి, రికార్డులు పరిశీలించారు. రోగులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయడాన్ని నిలిపివేస్తామన్నారు. రెండు రోజుల్లో గైనిక్ వార్డును ప్రారంభించడానికి ఏర్పాట్లు చేపట్టాలని వైద్యులను ఆదేశించారు. అంతకు ముందు కార్మిక సంఘాల నాయకులు సీఎంఓకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సుజాతను వైద్యులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. ఆసుపత్రి మెడికల్ అధికారి రాజేశ్వర్, కొత్తగూడెం డీవైసీఎంఓ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు ఉన్నారు.

జైలు పాలైన మున్సిపల్ కౌన్సిలర్

కాగజ్నగర్టౌన్: కాగజ్నగర్ మున్సిపాలిటీలోని ఓ వార్డు కౌన్సిలర్ జైలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కాగజ్నగర్ మున్సిపాలిటీలోని ఓ వార్డు కౌన్సిలర్ అదే వార్డుకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అ ప్పట్లో కాగజ్నగర్ టౌన్ పోలీసుస్టేషన్లో కేసు నమోదు కాగా, బెయిల్ మంజూరైంది. బెయిల్ను రద్దు చేయాలని బాధితురాలు ఆసిఫాబాద్ కోర్టును ఆశ్రయించింది. దీంతో శుక్రవారం కోర్టు బెయిల్ రద్దు చేయడంతో పోలీసులు ఆయనను జైలుకు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై కాగజ్నగర్ పోలీసులను సంప్రదించగా వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు

బెల్లంపల్లి: చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య విభాగ సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రభాకర్ అన్నారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రెండో రోజు జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మత్స్య సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ చేపల పెంపకం కోసం రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. మంచి నేలలను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని, మేలు జాతి చేపపిల్లలు సాగు చేయాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శివకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 4-11-2023



ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల లోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధ పడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవ్యస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి.



మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● తగినంత నిద్ర
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● ఫ్లూ టీకాలు
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● పరిశుభ్రతను పాటించడం
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● తగినంత దూరం పాటించడం
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు


హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణు గోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పీ వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పీ వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పీ వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరప్పు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.